# యాచన

శ్రీ రుక్మిణీనాథశాస్త్రి

౧

"ఒరేయ్ —"

ఉలిక్కిపడి చూచాను. ఎవరా? అని. సూరి!! ఇతఃపూర్వం మాకున్న పరిచయం లవ లేశమైనా, యిల్లా పిలుస్తున్నాడు మరి.

"క్యా భాయ్, పిలిచినా పలకవ్?"

పరిచయమందహాసం చెయ్యాలని చూస్తున్నాను. దీం దుంపతెగా— ఊఁహూఁ - మారాం పడుతోంది.

"ఏం? అల్లా గమ్మత్తుచూపులు చూస్తావ్?"

"ఏమీ లేదండి!"

"ఇదుగో - భాయ్ - అండీగిండీ జాంతే నై. మనం భాయీ అంటే- భాయీ-. లౌకిక మర్యాదలు, శుష్కప్రియాలు వొద్దు. హృదయాలు విప్పి మాట్లాడుకుందాం."

నాకు వికారంతో కూడిన నవ్వు వొచ్చింది. ఆపుకున్నాను. యిల్లా నేను వెనక, చవకగా హృదయం విప్పి, విప్పమనీ అన్నప్పుడల్లా ఎందరు నవ్వుకున్నారో?

"ఏం అల్లా ఆలోచిస్తున్నావు? నవ్వుకుంటూన్నారు? తమాషాగా ఫీలు అవుతున్నారా?"

"కాదండి. మీరు ఇంత అమాయికులే. యిల్లా అయితే లోకంలో ఎల్లా నెగ్గుకొస్తారా- అని ఆలోచిస్తున్నాను."

నమ్మినట్లు కనబడుతోంది. కానీ - నా నుదురు దొంగను పట్టి యివ్వకుంటుందా?

"అదుగో మళ్లీ నన్ను మీరు అంటున్నావు? ఏకవచనం. మనది రామప్పంతులకి (కన్యాశుల్కంలో) ఎదురు మతం." నవ్వుతున్నాడు.

"క్షమించాలి. అయినా నా అలవాటును యిక్కడ మార్చుకోయత్నిస్తాను." అర్మీనియన్ స్ట్రీటు దాటాలిగనక వొళ్లు దగ్గర బెట్టుకుని, మాటలు మాని బైటపడ్డాం.

"ఎప్పుడు వొచ్చావ్ యిక్కడికి?"

"యిక్కడే ఉంటున్నానండి."

"ఎక్కడా ఉద్యోగం?"

"లేదండి ఊరికేనే వచ్చాను." (అబద్ధం. నేనూ పొట్ట చేత పుచ్చుకునే వొచ్చాను).

నెమ్మదిగా వైయం. సి. ఏ. దాకా వచ్చాము. నాకు నో రూరుతోంది. రామకృష్ణ లంచ్ హోం నీరవాహ్వానాలతో రమ్మని బతిమాలుతోంది.

"రాండి, కొంచం కాఫీ తాగుదాం."

"నా దగ్గిర డబ్బుల్లేవు. ఐనా మీరు పోండి, నే నిక్కడ ఉండగలను."

చివుక్కుమంది ప్రాణం.

"రాండి నా దగ్గిర ఉన్నయిలెండి."

రెండ్రణా అంటూ అరిచే డ్రైరీలకేసి చూస్తున్నాడు. వీపు తట్టి, రామకృష్ణలోకి లాక్కెళ్లాను. అర్ధరిచ్చి బాతాఖానీలో పడ్డాం. — పళ్లాల చప్పుడులోనూ, మా లాంటివాళ్ల బాతాఖానీమహాభాష్యపు రొదలో కళకళలాడుతూన్న వెయ్యి సంతర్పణల గలభాలో —- అక్కడక్కడ వినబడుతోంది. వోః తన దుర్దశను వెళ్లబోస్తున్నాడు. పాపం.

బైటకొచ్చి కిల్లీ యిచ్చి సిగరెట్ ఆఫర్ చేశాను.

"వొద్దు భాయ్ — మనం అవతారాలు, (సిగరెట్టు, బీడీ,) దాటి విరాట్ స్వరూపం (చుట్ట, పొడుం, మసాలా) దగ్గరకే వెళ్లాం."

నవ్వు వొచ్చింది. కాశీని చుట్టలు కొనిపెట్టి, నేను దేవతలు కటాక్షించి యిచ్చినవరం, సిగరెట్టు తొలిగ్రుక్కలు పీలుస్తున్నాను.

"భాయీ! నా పద్యాలు కాశీని వినాలి!"

నాకు పనేమీ లేదు ముంచుకొచ్చేది. సరే అన్నాను. అటు హైకోర్టుపక్కలకు తీసుకెళ్లి కూచోబెట్టి చదివాడు. అన్నింటిలోనూ, ఏదో వో చమత్కారం వుందిగాని, 'వేశ్య'మీద రాశిన 'కావ్యం' చాలా బాగుంటుంది.

చాలా కొండ జరిగాక చివరకు వేశ్య అంటుందీ: 'నా జీవితం అంతా గాలించాను; ఎక్కడా సుఖం దొరకలేదు. మళ్లీ మొదటికొచ్చి చూస్తే — అంతా అయోమయంగా, భయం భయంగా వుంటోంది, కొత్త కొత్తగా వుంటోంది' అని. పక్కనున్న వేదాంతి అంటాడూ... 'అల్లా అంటావేం? నీవు ఎంత ప్రేమను ఎరుగున్నావ్? ఎంత స్వేచ్ఛాజీవివి! ఎంత ఆశాజీవివి?' అని. వేశ్య అంటుందీ-? 'ప్రేమా— సింగినాదం జీలకర్రాను; తోటి మనుష్యులా ? జలగలు ! తెలీకుండా నెత్తురు పీలుస్తారు; స్వేచ్ఛా— ? అఘ ప్రసూనాలు తలలో తురుముకోడం; ఆశా?— కన్నీటి బొట్టుపైని సూర్యకిరణం తెప్పించే ఇంద్రధనువు!! ఎందుకు లెండి ఇప్పుడు వాటి స్మరణ- మీ పనేదో మీరు చూచుకోండి!!' అని.

వేదాంతి అంటాడూ భరతవాక్యంగా...'ఒసే- చూడు, పిల్లి (తానే) —పాలనుకొని, వెన్నెల కింద బడితే— ఆగచ్చునే నాకుతోంది చూడూ' అని.

"సూరిగారూ ! ఇంత గొప్ప కవుల్ని ఆదరించని దేశం, ఏఒక్క ఆర్టిస్టునూ పోషించని దేశం ... తగుదు నమ్మా అంటూ ఎలా 'ప్రావిన్స్, స్వతంత్ర్యం కావాలి' అంటూ తగూకొస్తుందీ"? అన్నాను.

పాపం. ఆయన్ను ఏదో కెలుకుతూన్నా నల్లే వుంది. గాద్గదికంతో- 'భాయీ ! నిజం చెప్తున్నాను. నాపద్యాలు విని, నాముఖం చూసి, ఎద్దేవా చేసిన వాళ్లని నే నెరుగుదునుకానీ - యిల్లా చక్కగా తెలిశి మెచ్చుకున్నవాడిని చూణ్ణేలేదు భాయీ ' అంటూ చాలాఇదయ్యాడు సూరి. — నావళ్లు మండిపోతోంది. మేరీ పిక్ ఫోర్డు వస్తే— లండన్ లండనంతా వొరగబడ్డారుట. ఏ రాజాధిరాజుకూ జరగనంత అఖండ గౌరవం చేశారుట ఆమెను. ఇదా-? ఏ వొక్క శిల్పినీ పోషించని దేశం. వెధవదే—. పళ్లు పటపట కొరుకుతూన్నాను-నేనే మహాకవినై జీవితం అంతా ద్వేషింపబడినట్లు.

ఎవరో- ఆదారిన పోతూంటే-వారిని పేరెట్టి పిలిచాడు. సరే అని లేచాను వెళ్దామంటూ.— నాకేసి చూస్తూ—"నీ అడ్రసు ?"

"౧౮ సుంక్వార్ స్ట్రీట్-ట్రిప్లికేన్."

"అచ్ఛా- రేపు కలుస్తాను." అని ఆ కొత్తాయనతో పడి పోతున్నాడు. మళ్లీ వెనక్కొచ్చి— బ్రాడ్వే దగ్గర బస్ స్టాప్ ఆశ్రమభూమివద్ద ర్నుంచున్నాను బస్ కోసం. చలపతిరావు కనిపించాడు. పిచ్చా పాటీ— చెప్తున్నాం. సూరి మాట వొచ్చింది. చలపతిరావు— 'ఇవాళ మీకు అంటుకున్నాడేం — అంబాజీపేట ఆమదం. భలే జిడ్డు. ఎంత వొదిలింది?' అన్నాడు.

చురుగ్గా చూశాను. వెటకారంగా నవ్వాను. ఏడ్చావులే— నీ కేం తెలుసు ? అతని గొప్పఅన్నట్లు.

చలపతిరావు అసాధ్యుడు. "అల్లా చూడకండీ- యీ అభిమానం— నాలుగురోజులు పోతే— వుండదు లెండి..."

ప్రసంగం తప్పించాను. ఆ సంగతీ యీ సంగతీ మాట్లాడి 'రౌండ్టానా' దగ్గర దిగిపోయాడు— చలపతిరావు.

౨

అరిచేతుల్లో ప్రాణాలు పెట్టుకొని— వైట్ వేసుంచి...బసాటోకేసి— రోడ్డ్— క్రాస్ చేస్తున్నాను. ఎదురుగుండా సూరి...

"ఫర్వాలేదు. రా"

ఎల్లాగో అల్లా గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని వొచ్చాను. నేను అల్లా కెలిస్రోడ్డు బస్ ఎక్కి— ఎగ్మోరులో దిగి- అక్కణ్ణుంచీ - మాంబళం పోవాలి.

'ఐతే—నేనూ కొంతదూరం వొస్తాను' అన్నాడు సూరి.

'సరే'

"భాయీ — నిన్నటి పద్యాలు ఎలా ఉన్నై?"

కన్నుబొమ్మలు పైకెత్తాను. నుదురు ముడతలు పడ్డవి. కనురెప్పలు కళ్లను మూసి నోటితో చెప్పాలా-- వేరే -- అని అంటున్నాయి. కొద్దిగా తల ఎగరవేశాను.

"భాయీ! 'వేశ్య' పద్యం యిస్తే—'అమాత్య' రిటర్ను చేశింది."

"అమాత్య?"

"అవును, అమాత్య !! ఏదో నాలుగ రాళ్లిచ్చే పత్రిగ్గదా అని పంపితే........."

"ప్చ్ ! "

అప్రయత్నంగా భారత్ కెఫేలోకి పోయాం. జేబు దులుపుకొని బైటపడి కెలిస్ రోడ్డు బస్ ఎక్కాం. టిక్కట్టువాడు వొస్తే — నేను 'ఓకరు బ్రిడ్జి' అన్నాను. సూరి డిటో అన్నాడు. అణాన్నరా తీసి రెండు టిక్కట్లూ నేనే కొన్నాను. ఆ మాటా — యీ మాటా మాట్లాడుతున్నాడు. స్టేజి, సీక్రిట్, స్టూడియో — ఈ త్రిశూలంతోనే పరిపాలిస్తున్నాడు: కొంతదూరం దాటాక — నేను — మాంబళం...... నౌకరీ — ఈ విషయమే......... తెగ ఆలోచిస్తున్నాను.

"భాయీ — పిల్లలెంత మంది నీకు"?

"ఇద్దరు"

"పేర్లు?"

"అమ్మ—నాన్న."

"నేనే ఐతేనా — సౌభరి: జాహ్నవి... అని పెట్టేవాణ్ణి"

ఎవడడిగాడు?

"కాస్సేపు ఊరుకోండి!"

నొచ్చుకున్నాడు. ఎగ్మోరు స్టేషన్ దాటి క్షణంలో— మా బస్—ఓకర్ బ్రిడ్జి బస్ స్టాప్ ఆశ్రమం దగ్గర కొచ్చింది. దిగాం.

"భాయీ! వొక్క విన్నపం"

"ఊఁ!"

"ఈరాత్రికి అన్నం లేదు మరి. రెండు గారెలు యిప్పించాలి నివ్వు."

నాకు వేళ ఔతోంది. మాంబళం పోయి, మాట్లాడి, (ఏముందీ. ఉద్యోగం దేవిరింపే) మళ్లీ రావాలి. —

"హోటలెక్కడ??"

"యిక్కడే— పంకజ లంచి — ఎగ్మోరు హైరోడ్డుమీద."

"పదండి."

"ఇళ్లి ఆయ్న పని పూర్తి చేస్తూ ఉండగా విశ్వేశ్వర్రావు వొచ్చాడు. అతని బలవంతాన మళ్లీ తలో అరకప్ కాఫీ — గ్రోలి — దగ్గిర దగ్గిర — పావలా భరించి, బైటపడ్డాం.

'థాంక్స్ బ్రదర్' సూరి.

"నో మెన్షన్."

యింతలో నీలికంగు బస్సు రావడమూ... ఆదరా బాదా బస్ స్టాప్ దగ్గరకు జేరుకోడం. ...జరిగింది. విశ్వేశ్వరరావు మాంబళం వొస్తున్నాడు: సూరి మమ్మల్నిద్దర్నీ ఎక్కించి తాను ఎటో పోయాడు.

విశ్వం— 'ఏమండీ ఎక్కడ దొరికాడు? పాకు ఈయన!"

"ఏముటోనండి—పాపం—అల్పసంతోషి".

"అంతేకానీండి—భరించలేమండి, అబ్బ!!"

"ఏం?"

"వేధిస్తాడు!!"

"ఊఁ !"

ఊఁ అన్నానేగానీ — నాకూ అల్లాగే ఉంది అప్పుడే.

## 3

నేను ఎంత ఆశపడి మద్రాసు వొచ్చానో— అంతగా లాభించలేదు. వొకటి రెండు చోట్ల లాభిస్తుం దేమో అని ఆశగా వుంది. Try చేస్తున్నాను. కానీ— ఏమిటో — యిప్పటి నా స్తితి అంతా తెగ తిప్పటగా ఉంది. ట్రాంవాళ్లకూ బస్సులవాళ్లకూ— కుమ్మరిస్తున్నాను: సాయింత్రం ఔతోంది. హొటలుకు పోయి వొకరితో మాట్లాడి— యింటికి చేరుకో బయలుదేరాను. చీకట్లు మీదపడి— దబాయించ బోతూన్నై. రామకృష్ణలో ఆ దీపాలు ఎంత నావంటివాణ్ణైనా నవమన్మథుణ్ణిగా చేస్తూన్నై. చిక్కని కాంతిలోః దీపాలమీది మోజుకోసం వెళ్లి—నోటికి పని చెప్పి— మళ్లీ భోజనం దేనికని—అక్కడే విరుముకు తింటున్నాను.

"హల్లో."

—సూరి.

కూర్చోండి అన్నానేగానీ — చలపతిరావు అన్నట్లు-జిడ్డు—వొదుల్తుఃదేమో అని—కొంచం...

సర్వర్ What Sir అని అడిగాడు సూరిని— ఏం ఆర్డర్ యిస్తాడో అని — చూస్తున్నాను, ఓర కంటితో.

పెదిమ విరిచి అడ్డంగా, తల ఊయించాడు, ఏమీ అక్కర్లే దన్నట్లు.

సర్వరు—నన్ను 'యింకా' అన్నాడు.

'కాఫీ'—అని సూరికేశి—'మీరు?' అన్నాను.

'నా కేం వొద్దు. కానీ—బిల్ లో— యిద్దరికి అని వేయించు. మరేం లేదు. శేషయ్య వొచ్చాడేమో అని అనుమానంతో లోనికి వొచ్చాను. అతను లేడు. ఊరికే—వెళ్తే—తిని ఎగేస్తున్నట్లు వాళ్లు అనుమానపడి తల కొట్టినంతపని చేస్తారు. పోనీ— అంటే— నాకు కోరికా లేదు, జేబులో దుగ్గాణీ—లేదు' అని వొక్క దమ్ములో ఊదేశాడు సూరి.

—ఎంత చెడ్డా—కవి! ఎంత రజ్జుగా చెప్పాడు!!

సర్వర్ కాఫీ తెస్తున్నాడు. కాఫీ అయినా యిప్పిద్దాం అనుకున్నాను. కానీ—నాకు వాక్స్థానశని! జాతకాన్ని పుచ్చుకుని శిరోమణిదాకా— పో అక్ఖర్లేదు, నాకే తెలుసు. 'ఈరాత్రి భోయినం ఉందా మీకు' అన్నాను. ఉలిక్కిపడి— 'హుఁ' అన్నాడు. కంఠస్వరమూ, మనస్సుని పట్టి యిచ్చే మొహమూ,— నాకు భోజనం లేదు కాని... నువ్వుకూడా యద్దేవా చెయ్యాలా అనీ — యిప్పుడా — హేళన అనీ చెప్పాయి నాకు.

కాఫీ వొచ్చింది. రెండుగారె లన్నాను నేను, సాంబార్ అన్నాడు సూరి.

నేను కాఫీ తాగి సిజర్ ముట్టించాను. 'డ్రీం' లో పడిపోయాను. గారెలు తిని— పూరీలు కూరతో పట్టించి—కాఫీ అక్ఖర్లేదని మంచినీళ్లు తాగాడు సూరి.

చలపతిరావు యితన్ని ఇల్లాగే ఎరుగున్నాడు కాబోలు! చుట్టలు అడిగి కొనిపించాడు. నేను రోడ్డు క్రాస్ చేశి బస్ అందుకోవాలి. నాతోపాటు వొచ్చాడు. యింకా యేం వొదిలిస్తాడో అని లోలో ఇదౌతున్న నన్ను గమనించినట్లే లేదు సూరి. బస్ వొచ్చింది, ఎక్కబోతున్నాను.

'మరి—'

వెనక్కు తిరిగిచూస్తే— ఏం మునుగుతుందో అని చూణ్ణేలేదు. యింకా— ఏ మిమ్మంటాడో— థాంక్స చెప్పటానికేమో—ఆ'మరి' థాంక్సూ కాదు గింక్సూ కాదు. దేనికో—పాచికేస్తున్నాడు.

## ౪

మెయిలులో రాజారావు వొస్తాడని సెంట్రల్ స్టేషనుకు పోయాను. ఆయన వొస్తే నాకు చాలా వీలు. రేడియో టాక్ కోసమై - ఆయనరాక...నాకు అనుకోని ఉపకారం. ఆయన కొత్త మనమాట- ఆమాంబళం వాళ్లతో అంటేనా- అని అనుకొంటూ- వెళ్లాను.

ఎవరో వొస్తా రని - సూరి అక్కడ.

'ఏం భాయీ!'

విషపునవ్వు నవ్వాను.

"భాయి! నిన్నొకటి అడుగుతాను, నిజం చెప్పు."

"ఏమి టది?"

"ఉద్యోగ ప్రయత్నం యేమన్నా చేస్తున్నావా-?"

దాద్దామనుకున్నానుగానీ- దాయలా - చెప్పేశాను.

'నే నోటి చెప్తాను. వినూ. నౌకరీ- అదే ఉద్యోగం. మన అదుర్దాకొద్దీ - వాపోయి దేవులాడుతాం - గానీ - దొరకదు. యివ్వరు. నాతల చిట్టెం కట్టింది. (నిట్టూర్చి-) ఎవరి లక్ వారిది. Try Try Try again అన్నారు. చూడు!"

"అందుకే - నేను రాజారావుకోసం వొచ్చాను. ఆయన తెలుచుకుంటేనా - ?"

"అంతవారా - ???"

"ఆఁ."

ఇంతలో దూసుకొంటూ మెయిల్ వొచ్చింది. రాజారావుగారు దిగారు. యిద్దరం కదులుతూంటే... సూరి వొచ్చి, తన ఫ్రెండ్ రాలేదని చెప్పాడు. తన్ను యింట్రడ్యూస్ చెయ్యమన్నట్లు - లాలనతో - చూశాడు. గానీ యీయన వెంటబడి ఎక్కడ మన గోప్యం చెడగొడతాడో అని చూడనట్లు నటించాను. బైటకొచ్చాం - హోటలు ఎవరెస్టుకు రిక్షాలో- మేమూ - జనరల్ హాస్పిటల్ పక్కనుంచి పడి పొలోకు సూరీ.

— ... వీలుచేసుకుని, రాజారావుగారు, ఆ మర్నాడు బయలుదేరారు. నేను రాజారావుగారితోటే ఉన్నాను. నాకోసం రాజారావుగారు బయలుదేరారు. 'లజ్' దగ్గర దిగి మాపని పూర్తిచేసుకో- వడిగావడిగా వడివడిగా పోబోతున్నాం. కచేరీరోడులోంచివొస్తూ- సూరి!

రాజారావుగారూ - సూరీ పరిచయ మంద హాసములు చేసుకుంటూన్నారు. నాకు చిరాకు ఎత్తుకొస్తోంది. వీడెక్కడ పోగైనాడంట- శనిలాగు!

రాజారావుగారు మహా మెతకమనిషి. చూడనట్లు పోక - వీణ్ణి పలకరించారు.

సూరి ఆయనకు దణ్ణం పెట్టి...నాతో - 'భాయీ ఆ ఖాదీకొట్టులో - కొత్తగా పెట్టారులే - కొంచం పరిచయం వుంది. నౌకరీకి ఎంత ప్రాధేయపడి వొచ్చాననీ!'

"ఏమయింది ?"

"లాభం లేదు."

శుభ మస్తూ అంటూ మేం బయలుదేరడ మేమిటీ- ఈ పైడిపలుకు లేమిటి ? రాజారావుగారూ భలేవారే- తగుదునమ్మా అంటూ - యింత కాఫీ పుచ్చుకొద్దాం అన్నారు. నా కేం- ఖర్చు- కాదు. కానీ- మనం నిక్కినీలిగి మనం- పోయేసరికి— ఆ అవతల పెద్దమనిషి వుండొద్దూ ... మన అవసరమా ? వాళ్లవసరమా ? ఇదీ- నాబాధ. 'చావండి' అన్నట్లు వోమూపు మూశి, సైఁ అన్నాను.

సూరికి మద్రాసు మద్రా సంతా హృత్కమలి. 'యిదుగో - బ్రాడీస్ రోడ్డు - యిక్కడే ఉడిపి హోటలు' అంటూ దారితీశాడు.

నా కక్కసి కాలుకొస్తోంది. రాజారావుమీదకసి కూడా కలిపి.—'సూరీ ! మద్రాసులో ఎన్ని కాఫీహోటళ్లో-అవీ ఎక్కడెక్కడో - అకారాది క్రమపట్టిక- తయారుచేసి ఉంచుకున్నా వల్లే ఉందే' - అని నవ్వాను. హోటల్ కుపోయాం-సూరి లఘువుగానే తృప్తిపడ్డాడు. ఏం చెప్మా? అని అనుకున్నాను. రాజారావుగారు కిల్లీలు కొంటూన్నారు. నన్నివతలికి పిల్చిసూరి-'భాయి సాబ్! వో పావలా యివ్వవూ ?' అన్నాడు.

'నీమొహం మండా !' అనుకున్నాను నాలో. లోలో. వెధవనాగరికత ఉన్న దున్నట్లు అని బతకలేమాయె.

ఏ మనుకున్నాడో మరి సూరి-'పోనీలే-వొద్దులే' అని అన్నాడు. ఉద్యోగానికని పోతూ వీడి ఆక్రోశం దేనికంటూ రాజారావుగారిపర్సు, చొరవ నటించి, అడిగి తీసుకుని, అందులోంచి - వో అర్ధరూపాయి (పావలా లేదు. మార్చచ్చు. కానీ - యిది వీడికి నొప్పి కలిగించవచ్చు అని యిట్లా చేశాను) తీసి - రాజారావు చూస్తూండగానే - సూరి కిచ్చాను.

చాటంత మొహం చేసుకుని, వెంటనే కృతజ్ఞతాభారంతో, నొప్పితో కుంగి, 'థాంక్స్' అని సూరి సెలవు పుచ్చుకున్నాడు.

విశ్వేశ్వర్రావు అన్నది నిజం. మహా వేధిస్తాడు!

❧

రాజారావుగారు చెప్పినా పని కాలేదు. రాజరాజేశ్వరుడు వొచ్చి చెప్పినా — కాలేదు. ఆశలు అడుగంటాయి. యింటిదగ్గర్నుంచి తెచ్చుకున్న మొత్తంలో ఘదే మిగిలింది. నిరాశ ప్రబలిపోతోంది.

బంధువులింట్లో పెట్టా - పరువుచుట్టా పెట్టి... బైట బైట తిని తిరుగుతున్నాను. కాలక్షేపం చేస్తున్నాను. గాలి ఆట్టంలేదు. ఏమీ తోచడంలేదు. దిగులు వికృతవదనంతో వెక్కిరించి వెక్కిరించి చంపుకుతింటోంది. ఏమీ చెయ్యడానికి తోచక- ఆక్వేరియంకు పోయాను. ఏఁన్నా సరే—కాస్సేపు నన్ను నేను మరిచే పోవాలి.

ఏ ఉపమానమూ దొరకని ఆ నీటిపాము ప్రియురాలికనుబొమ్మలా వంపు తిరిగి—ఉంది. ఈ ఈశ్వర సృష్టి ఇంద్రజాలం చూస్తూ— మైమరచి చూసిందే— చూస్తూ తిరుగుతూన్నాను. ఆ రంగురంగుల చుక్కల చాప నోరు తెరిచి—దేబె మోహంతో— సన్నని పన్ను దగ్గర నోరు మూసుకుంది. ఆ తాంబేలు— ఆ అడ్డ నిచ్చెన కన్నాల్లోంచి, ఆవలి ప్రక్కకు పోవాఁని— తల దూర్చి—పో ప్రయత్నించి- కన్నం విశాలం చాలక తాను పోలేక-— వోడిపోయీ— మళ్లీ ప్రయత్నిస్తోంది.

"బ్రదర్! క్షమించాలి!"

"ఎవర్రా నాయ్నా ???"

"సూరి!!!"

వీడిగొంతుక ఎల్లా పిసకడమా — అని ఆలోచిస్తున్నాను.

"బ్రదర్! నీతో కించిత్తు క్షమార్పణ చెయ్యాలి"

"ఊఁ—కానీ—"

"నేను ఇక్కడ ఎక్కువసేపు ఉండకూడదు. మా స్నేహితుడు లోపున ఉన్నాడు. మాట చెప్పి వస్తానని లోనికి వొచ్చాను. మర్యాదకు దయ వుంచి బైటకు రావాలి."

'ఏం గ్రహచారంరా నాయనా' — బైటకు వొచ్చాను.

పక్కనే కాఫీహోటలు వుంది. ఎంత వొదలాలో-

పక్కనే ఉన్న చెట్టునీడను యెవ్వరూ లేరు. అక్కడ కూచోబెట్టాడు సూరి.

"శాస్త్రీ! నిజం చెబ్తున్నాను. నువ్వు యేమనుకున్నా సరే— నేనూ నౌకరీకోసమే వల వేసి గాలించి వెతుకుతున్నాను. ఈసారి నేను వొక్క చేతిసంచీతో మాత్రమే మద్రాసు వొస్తి!— ఎన్నో వ్యసనాలను చంపుకున్నాను, వొక్క ఆకలిని తప్ప. ఆ ఆకలి-సృష్టి కంతకూ—సహజంగా ఉన్నదే. కాని నా ఆకలి వల్ల నేను 'వల్చర్'గా చూడబడుతూన్నాను. భూభారమై పోతూన్నాను. (ఏడుపు వొస్తోంది అతనికి). నా పేరు చెప్తే మండిపడతారు. నువ్వు అల్లా అందరిమాదిరీ కాదు, రసజ్ఞుడివి. (డిగ్రీ యిచ్చేశాడు. ఏం కావాలో యిప్పుడు...) లోకంకంటె వెయ్యి విధాల ఉన్నతుడివి...ఏదో వొక ఔన్నత్యం నీలో లేకపోలేదు. అట్టి నీవుకూడా...నన్ను - నిన్న లజ్ దగ్గర చూసీ చూణ్ణట్టు నటించావు. ఎవరు చేసిన పాపఖర్మం అనుభవించే దిక్కుడా...ఇాతే - నిన్న పావలాకు అర్ధ ఇవ్వడమూ యింతే - నాకు తెలుసు - ఇప్పత్తు - కాళిదాసు - యాచ్నా మోఘా వరమధిగుణే - నాగమే లబ్ధకామా - అన్నాడు. అంచేత నిన్ను అరమర లేకుండా అడిగి - ఎక్కసపెట్టాను. క్షమించు. భగవంతుడా! యిట్లామమ్మల్ని సాధించి వేధించి ఏం ఆనందం అనుభవిస్తావోయ్ తండ్రీ!" కన్నీళ్లు కార్చాడు.

—యిదంతా నిజమే? కన్నీళ్లు కొంతమందికి పైటలకు పైంట్లు తయారుగా ఉంటాయికాబోలు!

పైకిమాత్రం - "భాయీ ఇంత చెప్పాలా - చిల్లర లేకానూ - రాజారావు ఏమనుకోడు గనకానూ -

అల్లా యిచ్చాను గానీ - యింకో విధంగా ఆలోచించకు" అన్నాను.

"మరి—చూశీమూణ్ణట్టు నటించావేం?"

"తొందరగా పోతున్నాం - ఆలిశ్యం ఔతుందని."

"అమాటే చెప్పేయ్యాకపోయావూ - శాస్త్రీ! నీవు మోరల్ కవర్డ్వి కావే-"

- పిచ్చివాడు. లోని నిజం పైకి చెబితే - విషం కాదా ?

సమదాయించాను: తేరుకుని వెళ్లిపోయాడు. ఇదంతా నిజమేనా...? లేక ఇదీ వో వేషమా—? ఏమో మరి - కవీశ్వరుడు మరి - ఎన్ని చమత్కారాలైనా చెయ్యగలడు...

## ౬

రెండు మూడురోజుల్లో ఉడాయించేద్దామనుకొంటూన్నాను. నా కేమీ పాలుపోటం లేదు. మదరాసు వొచ్చేటప్పుడు నా భార్య - 'ముష్టెత్తుదాం - వంటలు చేద్దాం. పిలుపులు పిలుద్దాం, కాఫీహోటల్లో మీరు వడ్డనా - నేను పిండి రుబ్బడమూ - ఏదైనాసరే ఏమైనాసరే - ఏవృత్తయినా సరే - తప్పేమీ లేదు, స్వంత అన్నం తిందాం' - అని చెప్పినమాటలు అప్పట్లో వేడీ, మధ్యన బాధా, తుదికి - విషపునవ్వా నిచ్చాయి. కానీ - యిప్పుడు...చెప్పలేను, కుంగిపోతున్నాను, ఏ మొహం పెట్టుకొని యింటికి పోటం ?? అని.

హఠాత్తుగా శ్రీనివాసరావు కనిపించాడు సూరితో సహా, బ్రాడ్వేదగ్గర. మాపరిచయాల సంగతి, ఎరక్క - సూరి - మాఇద్దరికీ తొలిపరిచయం చేయబోయాడు. ఏంరా - అంటే ఏంరా - అని మేం సంభావణ మొదలుపెట్టాము. - విస్తుపోయి చూచి, వోః కుంగిపోయి ముళ్లమీద వున్నట్లు వున్నాడు సూరి.

కొంచెం సేపటికిగాని నేను గ్రహించలేదు అతనిబాధ. శ్రీనివాసులు — అతణ్ణి (సూరిని) మరీ తీసికట్టుగా చూస్తాడాయె - తానా - నాముందు కవిఆయె - యీ విషమస్తితి అతనికి మరీ యిబ్బందిగా ఉంది.

శ్రీనివాసులు ఆమాటా ఈమాటా తెచ్చి, 'వొరేయ్ నివ్వు నాఅతిథివిరా'- అని నన్ను ఆహ్వానించాడు. సూరి మాటో-? శ్రీనివాసరావు అతణ్ణి పిలవనేలేదు. కదలబోతున్నాం ఆమాటా ఈమాటా చెప్పుకుని, కిల్లీలు తీసుకొస్తానని శ్రీని బయలుదేరాడు.

సూరి నన్ను 'భాయీ!'

పరధ్యానం నటించాను.

"భాయీ!!"

"ఊఁ - ఏం ?"

"ఏం లేదు..." పడగ ముడుచుకునే తాచుపాములా తల వాల్చుకున్నాడు.

నా కర్థమైంది. కాని తెలీనట్లు చూస్తున్నాను.

శ్రీనివాసరావు యిన్ని గోల్డ్ ఫ్లేకులూ కాశిని చుట్టలూ తెచ్చి 'కదుల్దామా-??' అని అన్నాడు.

'వుంటానండీ' అని సూరికేశి చూశాను. అతని మొహం స్పష్టంగా చెప్తోంది, వీళ్లు ఈపూట భోజనానికి పిలిస్తే బాగుణ్ణే అని.

శ్రీనివాసరావు తొందరపడుతూన్నాడు. వో చుట్ట అడిగి తీసుకుని, సూరి కిచ్చాను. ఆక్వేరియంలో చాపలాగు - దేబెమొహంతో సూరి నిష్క్రమించాడు.

శ్రీనివాసరావు ఆమాటా ఈమాటా చెప్తూ-

"అబ్బాయి! వానవెలిశాక కాశేవెన్నెట్లో ఉన్నానురా నేను. యిదుగో. సిగరెట్టు ముట్టించు: తీరిగ్గా కథుర్లు చెప్పుకుందాము... నిజం చెప్తే - నమ్ముతావో - నమ్మవో - కానీ, తెనాల్లో ఈమధ్య నేను పడ్డ, బాధలు కొత్తమరిచేపోయానురా - యిక్కడ వో డిస్ట్రిబ్యూటర్ దగ్గర నౌఖరీ. డెబ్భయిరూపాయి లిస్తారు. సుఖా లంటావా? - అవి ఎప్పుడూ సాధ్యాలే—ఆనందం అంటావూ-? అది మనస్సు కల్పించే ఇంద్రజాలం. ఎప్పుడైనా..." అంటూ రోటరీ మిషన్ సంగీతంలా ఉపక్రమించాడు.

నాకూ ఏదైనాపని చూపించిపెట్టమని అందామని పెదవిదాకా వొచ్చింది. కాని- నిక్కుకుపోయాను. 'విప్రాః పశ్చిమబుద్ధయః' అని ఊరికే అన్నారా?

హోటల్ ఎస్ప్లనేడులో భోంచేశి అద్దంలో చూస్తూ చేతులు కడుక్కొని, కిందకొచ్చి పేము సోఫాల్లో పత్రిక చదివి, మళ్లీ బయలుదేరాము. మూకర్ నల్లముత్తు వీధిలో యున్న 'బ్లాకులు' ఆఫీసుతాళాలకు తీసుకుని- మెల్లిగా బీచ్ స్టేషన్‌కు వొచ్చాం.

"నువ్వు ఎందాకా?" అన్నాడు నన్ను.

"నీతోనే."

అచ్ఛా అని రెండు మాంబళం టిక్కెట్లు కొని - రైలులో కూర్చున్నాం. యింకో ఉద్దేశంతో వెంటబడలేదుగానీ - ఎల్లాగయినా వీడిచేత అడిగించుకొని - ఏయాభై రూపాయిల job ఐనా లంకించుకోవాలి అని ఆలోచిస్తున్నాను. పార్క్ స్టేషన్ దాటి ఎగ్మోర్ స్టేషను దగ్గరకు వొస్తూంది, ఎలక్ట్రిక్ ట్రైన్.

'ఏంరా!'

'ఆఁ!'

"మరేం అనుకోకు - దేనికి వొచ్చావురా -ఇక్కడికి (మద్రాసుకి)?"

- నవ్వాను. ఆ వొక్కనవ్వూ నాజీవితాన్నంతనూ పట్టి యివ్వవచ్చు.

"నౌఖరీ చూట్టానికి వొచ్చావుట్రా ?"

వెధవదర్పం- 'ఔను' అనలేకపోయాను. పెదవి విరిచి 'ప్చ!' అన్నాను.

"- చూశావా మంచి ఫిలిమ్స్ వున్నై వూళ్లో" అన్నాడు మళ్లీ శ్రీనివాసరావు.

"ఉఁహూఁ" అన్నాను లేదన్నట్లు.

'అయితే ఫస్ట్ క్లా సిప్పిస్తాను. పో, మినర్వాకు. 'లైఫ్ ఆఫ్ ఎమిలి జోలా' మంచి ఫిలిం."

'అచ్ఛా' అన్నాను. చేసేదిలేక.

మాంబళంలో దిగి వాడిఆఫీసుకు పోయాం. మేనేజర్‌తో పది పదిహేను నిముషాలు మాట్లాడి యివతలకు వొచ్చి, "అబ్బాయి నాకు నెల్లూరు ప్రయాణం తగిలింది. సాయంత్రం పోవాలి. సరే. కాని కాస్సేపు నువ్వు పడుకుంటావా—?"

"ఆహా — మరి నువ్వు?"

"పనుంది - పోను. దా" అని వొగదిలోకి తీసుకెళ్లి వోమంచం చూపించి దిండు యిచ్చాడు. తనపనిలోకి తాను పోయాడు!

—అయిదింటికో - అయిదున్నరకో నిద్ర లేపాడు. మొహం కడుక్కొని తల దువ్వుకుని, బయలుదేరాము.

"భోంచేస్తావా యిప్పుడు?"

'అభ్యంతరం లే'దన్నాను.

యిద్దరం భోంచేశాము. బైటికొస్తూంటే మినర్వాకు ఫస్ట్ క్లాస్ టికెటు - ఆర్డర్ - యిచ్చి 'యిహనే వెళ్తాను నెల్లూరు పోవాలి' అన్నాడు శ్రీని.

'ఆచ్ఛా.'

కిళ్లీలూ - సిగిరెట్లూ కొని పర్సు లోజేబులో పెట్టుకోబోతున్నాడు.

'శ్రీ!' పిలిచాను.

'క్యా?'

'వో రెండురూపాయలు కావాలిరా.'

నాకంఠం చచ్చీచావనిదశను సూచిస్తోంది.

'అలాగే'.

పర్సులోంచి డబ్బు తీశి అరిచేతిలో పెట్టుకొని నాకేసి చాచాడు చెయ్యి తీసుకో అన్నట్లు. యిదో మర్యాద.

మూడురూపాయలు తీసుకున్నాను.

మళ్లీ శ్రీనివాసరావు అన్నాడూ: 'యిక్కడే వో ప్రెస్‌లో ప్రూఫ్ రీడర్‌గిరీ కాళీ ఉంది. వోపాతిక యిస్తారు. వొప్పుకో. ఓం ప్రథమంలో ఎక్కడో అక్కడ ఇరికితే - తర్వాత పైపైకి ఎగ్రాకవొచ్చు.'

'—పాతికా —భూమిపాతిక — ఎందుకులే' అన్నట్లు - పెదిమ విరిచి తల విశిరాను. 'రైకో' అని శ్రీనివాసరావు వాళ్ల ఆఫీసుకేశి వెళ్లాడు.

—ఊళ్లోకి వొచ్చాను.

'భాయీ!'

'ఆహో—సూరే!'

ఇందాక శ్రీనివాసులు దగ్గిర మూడురూపా యలు తీసుకునేప్పటికే - నాకు చచ్చీచావనిప నైంది. తల కొట్టినట్లైంది. ఈసూరి యిలా ఎన్నాళ్లు బత గ్గలడో?

'క్యా భాయి!' గర్జించాను.

"శ్రీనివాసరావు చూశావా - యిందాక భోజ నానికి పిలవనేలేదు."

ఏమో మరి మీటరమ్స్ నాకేం తెల్సు చెప్పండి? అయినా నేను అతిధిని చూడండీ—?"

"కాస్త నువ్వేమైనా తీసుకుని యిస్తా వను కున్నాను."

—యిదో ఆటా—? పైకి 'చెప్పకపోయావా?' అన్నాను.

"వేరే చెప్పాలా - నా కుచేలదారిద్ర్యం నీకు తెలవందేమిటి భాయీ!"

"పాపం శ్రీనివాసరావుదగ్గరకూడా అట్టే లేవండి!"

"లేకేం—వుంటుంది!"

వెధవ Poetic eye.

బుకాయిద్దా మనుకున్నాను.

"అబ్బే లేదండీ - యిందాక నేను హోటల్ బిల్ కోసం వాడిపర్స్ తీసి చూశాను. రూపాయిన్నరే ఉంది."

"ఆరూపాయి లేకపోయావ్ శాస్త్రీ. వాడు మార్వాడీల గుమాస్తాకదా - ఆమాత్రం ఆఫీసులో దొరక్కపోతుందా-?"

—వోరి వీడిదుంప తెగా - ఎంతవరకూ దిగాడు!

"వాడి జీతంకూడా-అట్టే లేదండి".

"లేకపోవటమేమిటండీ - నే నంటే వాడికి. పనడు. నువ్వే ధైర్యంచేసి - యిస్తా వనుకున్నాను. యిందాక వోచుట్ట తీసుకు యివ్వలా - అలాగే వో రూపాయ లేకపోయావా—? వాడుకునేవాళ్లం!"

—వాడుకునేవాళ్లం !!! - నన్నూ కలిపాడు. పొడిచినట్లైంది. అమాంతం విరుచుకుపడ్డాను.

"యిట్లా తేరతిండి, మిత్రికూతా, దోపిడీ— దోచుకోటం, సిగ్గయ్యటుటోయ్: కవిట, కవి. అమోఘ రాత - తెలుగుదేశంలో - ఎవడు కాడోయ్ కవి."

"దాందుంప తెగా - కళ్ల క్కనపట్టం భయ మాయె. తే. తే. ఎక్కణ్ణుంచి తెస్తారు? కుప్పలు పోసు కూర్చున్నారా? యిల్లా సతాయించే బదులు ఏ అచ్చాఫీసులోనన్నా పని కుదుర్చుకోరాదూ? దేశబాధ తప్పుతుందీ.ధనికులు. ధనికులు! వీళ్లదుంప తెగా —పని చూపించి తిండి పెట్టేబదులు, కీర్తికోసం-బిచ్చం వేసి- పొమ్మంటారు. ఈ దోపిడీగాళ్లజట్టును తయారు చేసింది మహాదాతలే."

—పాపం! సూరి కిక్కురు మనలేదు. నిప్పులు మీద నుంచున్నట్లు నుంచుని ఆకాశంకేసి చూస్తున్నాడు.

వా డేమన్నా సమాధానం చెప్పవస్తేకాదూ- నానోరు లేవనీలు.

చేసేదిలేక—ఊరుకుని, 'మినర్వా ఎక్కడ?'

"లోన్ స్క్వేర్ లో."

"దా. చూపించు."

వొచ్చాడు. అదుగో అని చూపించాడు.

"సినీమాకు వొస్తావా?"

"రాను. పనుంది. "

"పైసా ఏమన్నా కావాలా?"

"అక్ఖర్లేదు."

వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు కనిపించలేదు సూరి.

౭

అయ్యో! శ్రీనివాసరావుదగ్గర బెట్టుకు పోయానే—అని బిట్టు వాపోతున్నాను. ఏం లాభం. వాడు నెల్లూర్లో. పోనీ అక్కడికే పోదాం అని అనుకున్నా, నువ్వు ట్రా—పని చేసేదీ—అని ములుకర్ర పుచ్చుకుంటాడు. అయినా అందడు.

ఆ మరుసటిరోజు సింగరాచారివీథి హోటల్ గో భోంచేసి కారు స్ట్రీటు దాటి నార్తు టాంక్ వీథులోంచి అంగలు వేసుకొంటూ వెంకట్రంగంపిళ్ల వీథి క్రాస్ చేసి సుంకువారి వీథిలో పడ్డాను. పోస్టు జవాను వొస్తున్నాడు.

"ఉత్తరాలు ఉన్నయ్యా?"

"యింట్లో యిచ్చానండీ."

ఎక్కణ్ణుంచో — ఉద్యోగం ఆర్డరేమో... కాలకీ?? యింటి దగ్గరున్నంచేమో—రమణ (నా భార్య) రాశిందేమో. ఏమో—ఎక్కణ్ణుంచో.—

గాలిలాగా ఊగిపోతూ - యింటికొచ్చి ఉత్తరం అడిగి తీసుకుని - చించి చూశాను.

"శ్రీ శాస్త్రీకి. నమస్కారాలు. నీ రెండుకాళ్లూ పట్టుకుని దణ్ణం పెడ్దామని మహవుంది. కాని మూణ్ణాలు బస్ కిచ్చే సత్తువలేక - జాబు రాస్తున్నాను. క్షమించు. ఇన్నాళ్లూ, అన్నిపాపాల్లోకీ - యితరుల మనస్సును నొప్పించడం మహా పాపమని అనుకొనేవాణ్ణి. యిప్పుడు కించిత్తు మతం మార్చుకుంటున్నాను.

"మనస్సుకు నొప్పి కలక్కపోతే - మనం ముందుకు పోం. చలిమిడి ముద్దగా ఉన్నట్టుగానే ఉంటాం: మానవమానసికవేదనకు ఖరీదు లేదు. నిజం. తల్లి, తండ్రి, భార్య, స్నేహితులు, సంఘం కట్టుకట్టి పోరి మొహాన వుమ్మేశి గెంటకపోతే, మానవమాత్రుడు సంపాదనకు దిగడు. సోమరిపోతు ఔతాడు. నిజం.

"నన్ను ఆనాడుమహాకవికింద కట్టిననీవు, నాపద్యాలకు తనిసి, నన్ను ఎక్కిరించినవాళ్లకై పళ్లు పటపటకొరిన నీవు, ఆనీవు, నీవు, నీడబ్బుకు నాలుగుసార్లు ఆశపడేటప్పటికి -ముకుకొక్కల వలోని పురుగునుగా చూశావును వ్వేమిటిలే - అందరూ చూస్తారు. నన్ను చూశారు. నిజం. కాని - యిన్నాళ్లనుంచీ రానిబుద్ధి, ఎన్నిసార్లో తల బొప్పి కట్టించినబుద్ధి, మొండికెత్తినబుద్ధి, నీవంటి రసజ్ఞుడి - సహనశీలుడి చీవాట్లతో - ఏమో - మరి - ఎంచేతో - దారిన పడ్డది.

"కాని-నావీ తప్పులు లేకపోలేదు. ఐనా నీవు - ఔదార్యంతో వాటిని అకలితప్పులకింద మన్నించితేనే నింకా ఆ బురదలోనే - కంఠందాకా నన్ను గుంజుకున్న ఆ ఊబిలోనే కూరుకునిపోయి - శవంలా బ్రతుకుదును. ఉద్ధరించి - మహోపకారం చేశావు. నీలో తెలీని ఔన్నత్యం ఉండని మహ అనుకునేవాణ్ణి... ఈ నాటికి కించిత్తుగానైనా గోచరించింది.

"జీవించడం అనుభవాలకోసం. యిన్నాళ్లనుంచీ-ఎత్తిన అవతారం చాలించి, కొత్త అనుభవాలు అనుభవించ బోతున్నాను.

ఆనీకోపంలో-ఘనికులనూ తిట్టావు గుర్తుందా...? ఉండదులే. ఎప్పుడూ - మాట పడ్డవాళ్లకేగానీ - అన్నవాళ్లకు గుర్తుండదు. సహజం. బిచ్చం పెట్టక పని చూపించాలి అని.

"నిజమైన దేశోద్ధారకులు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారిని బ్రతిమాలి 'శరద్ఘనంనాగ్దతి చాతకోపి' బ్రతిమాలి కంపోజింగ్ నేర్చుకోకుదిరాను. వో నెలా-నెలాపదిహేనురోజులు నేర్చుకుంటే వొస్తుంది అన్నారు. మొదటి రెణ్ణెల్లూ పదిచొప్పున యిస్తామన్నారు. ముందు భుక్తికి వుచితంగా వో ఘటి యిచ్చారు. ఆరు రూపాయలకు అన్నం పెట్టేహోటల్‌లో అన్నం తిన మొదలు పెట్టాను. నా సంచీ, చాపా - మా ఆఫీసులోనే.—

"భాయీ-నీసదుపదేశం ద్వారా నా అన్నం నేను తింటున్నాను. తింటాను. ఈ మహోపకారం చేసిన నీకై ఎన్ని steps ఐనా దిగి బ్రతుకు తెరువు చూసుకో-, పోజులు వదులుకో, మార్గదర్శివి ఐన నీకై - నా జీవితాన్నంతా పరమేశ్వరునకువలె మంగళహారతి ఎత్తుతాను. నిజం. కవులం, కవులం అని అంపోతులా తిరగక, కవిత్వశక్తి ఉండుగాక, అది దేశానికై వినియుక్తం అని మాన

వతను గుర్తించి, మానవుని సాధారణ ధర్మమైన బాధ్యతల్ని వహించడంలో నీవు చేసిన నవజాగృతి సంస్తవనీయము.

"ఈ జ్ఞానము ఏనాడో రావలసినదైనా—బండబారిన బుద్ధిమంతుణ్ణి గనక— ఆలిస్యమైంది. ఈ 'దాలిగుంటశాంతి' జీవితాంతమూ నిలుచునట్లుగా నీ ఆశీర్వచనము కోరుతూ— నీవున్న దిక్కుకై తల వంచి, ఈనా ఎడద, నీకై నిరంతరము కేలోక్రమ్పుగా నిలుపుకొనే—

నీ సూరి."

గబగబా వుత్తరం మణిచి, జేబులో పెట్టి పర్సు చూసుకొని వెంకట్రంగంపిళ్లవీధి చివరకు టర్మినస్‌కు పోయినాను, బస్ కోసం. సూరిని చూడాలి. ఏమిటో - 'కలదు నాలోన క్షీరసాగరము నేడు'-ఆగలేను. పారిస్ కార్నరు నేరుగా పోయేబస్సు లేదు. వేళకు దీం దంపతెగా ఎర్రగా కొట్టొస్తూ - వస్తూ హారిస్ బ్రిడ్జి పోయే బస్—కదలబోతోంది—ఖాళీగా.

(నిశ్శేషం)

---

విసుగుపుట్టించెడు ఆహార మిక ఉండదు

మీ ఆహారపదార్థములందు

సైంటిఫిక్ టి. టి. ఇంగువను వాడుడు

SCIENTIFIC TT ASAFOETIDA

జీర్ణశక్తికి తోడ్పడును. బహుమాన కౌపనులతోగూడ అమ్మబడును.

పౌ. ఖరీదు రు. 1—14—0.